AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
19-12-2025 (Friday) MAIN EDITION

## త్వరలో మంత్రి పదవి వస్తుంది.. రాజగోపాల్‌రెడ్డి



**అక్షరటుడే, హైదరాబాద్:** మంత్రి పదవిపై మరోసారి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే తనకు మంత్రి పదవి వస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన నాటి నుంచి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవి ఆశిస్తున్నారు. అయితే సామాజిక సమీకరణాలను ఛాన్స్ దక్కలేదు. తాజాగా అదృష్టం ఉంటే మంచి పదవి వస్తుందని ఆయన అన్నారు. ఇన్ని రోజులు ఆగినందుకు త్వరలోనే తనకు మంత్రి పదవి వస్తుందన్నారు. దీంతో అధిష్టానం నుంచి ఆయనకు సంకేతాలు అందినట్లు తెలుస్తోంది. కొంతకాలంగా ప్రభుత్వ వ్యతిరేక వ్యాఖ్యలు ఆపడం, తాజాగా పదవి వస్తుందని చెప్పడంతో పదవిపై సంకేతాలు అందినట్లు చర్చ జరుగుతోంది.

## సౌదీకి తలనొప్పిగా మారిన పాకిస్తానీ యాచకులు..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** సౌదీ అరేబియాకు పాకిస్తానీ యాచకులు పెద్ద తలనొప్పిగా మారారు. వీసా ఆంక్షలు, నోఫ్లై జాబితాలు, బహిష్కరణలు అమలు చేస్తున్నప్పటికీ పాకిస్తాన్‌కు చెందిన యాచకుల సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదని సౌదీ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మక్కా, మదీనా వంటి ఇస్లాం పవిత్ర స్థలాల్లో పాకిస్తానీ యాచకులు భిక్షాటన చేస్తూ కనిపించడం సౌదీకి పరువు సమస్యగా మారింది. హజ్, ఉమ్రా, పర్యాటక వీసాలను దుర్వినియోగం చేస్తూ చాలామంది పాకిస్తానీయులు సౌదీకి వచ్చి వీధుల్లో భిక్షాటనకు దిగుతున్నారని అధికారులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల సౌదీ అరేబియా దాదాపు 56 వేల మంది పాకిస్తానీయులను దేశం నుంచి బహిష్కరించింది.

## ఉగ్రదాడితో హైదరాబాద్‌కు సంబంధం లేదు



**అక్షరటుడే, హైదరాబాద్:** ఇటీవల ఆస్ట్రేలియాలోని సిడ్నీలో జరిగిన కాల్పుల ఘటనకు సంబంధించి తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. కాల్పులకు పాల్పడిన సాజిద్ అక్రమ్ హైదరాబాద్‌కు చెందినవాడే అయినా ఉగ్రఘటనతో సంబంధం లేదని వెల్లడించారు. ఈ ఉగ్రదాడిలో 16 మంది మృతి చెందిన విషయం తెలిసిందే.

## చోరీ కేసు ఈడీకి అప్పగింత



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** శబరిమల అయ్యప్ప దేవాలయంలోని బంగారు విగ్రహాల దుర్వినియోగం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ వ్యవహారంలో పూర్తిస్థాయి దర్యాప్తు చేసేందుకు ఈడీకి కొల్లాం విజిలెన్స్ కోర్టు అనుమతిచ్చింది. ఈ సందర్భంగా కేసులో కీలక దస్త్రాలను కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించనుంది.

## నాలుగు రోజుల నష్టాలకు తెర..



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** స్టాక్‌మార్కెట్‌లో నాలుగు రోజుల వరుస నష్టాలకు బ్రేక్ పడింది. డాలర్‌తో రూపాయి మారకం విలువ పెరగడంతో ఇన్వెస్టర్లలో సెంటిమెంట్ బలపడింది. ఎఫ్ఐఐలు సైతం నికర కొనుగోలుదారులుగా నిలుస్తుండడంతో మార్కెట్లు కోలుకున్నాయి. సెన్సెక్స్ 447 పాయింట్లు, నిఫ్టీ 160 పాయింట్ల లాభంతో ముగిశాయి.




## గ్రీన్‌కార్డ్ లాటరీ ప్రోగ్రామ్‌ను నిలిపేసిన ట్రంప్

**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. గ్రీన్‌కార్డ్ లాటరీ ప్రోగ్రామ్‌ను నిలిపేశారు. అమెరికాలోని బ్రౌన్ విశ్వవిద్యాలయంలో ఇటీవల కాల్పులు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనలో ఇద్దరు చనిపోయారు. తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ కాల్పులకు పాల్పడిన నిందితుడు పోర్చుగీస్ చెందిన వాడిగా అధికారులు గుర్తించారు. నిందితుడు గ్రీన్‌కార్డ్ లాటరీ ద్వారానే అమెరికాకు వచ్చాడు. దీంతో ఈ విధానాన్ని నిలిపివేయాలని ట్రంప్ నిర్ణయించారు.

## ఫ్రీ లాంచ్ ఆఫర్ పేరుతో మోసం.. నిందితుడి అరెస్ట్

**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** ఫ్రీ లాంచ్ పేరుతో రూ.300 కోట్ల మోసానికి పాల్పడిన నిందితుడిని ఈడీ అరెస్ట్ చేసింది. జయత్రి ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ కాకర్ల శ్రీనివాస్‌ను అధికారులు చెన్నైలో అరెస్ట్ చేసి హైదరాబాద్ తీసుకొచ్చారు. కాగా తమను మోసం చేశారని బాధితులు ఫిర్యాదు చేయడంతో గతంలో తెలంగాణ పోలీసులు శ్రీనివాస్‌ను అరెస్ట్ చేశారు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన తర్వాత పరారీలో ఉన్నాడు. అయితే ఇదే వ్యవహారంలో మనీ లాండరింగ్ చట్టం కింద ఈడీ కేసు నమోదు చేసింది. ఇందులో భాగంగా తాజాగా ఆయనను అరెస్ట్ చేసింది.



## ఆ ఫుట్ ఓవర్ బ్రిడ్జి తొలగింపు..

**అక్షరటుడే, హైదరాబాద్:** రైల్వే స్టేషన్లలో సౌకర్యాలు, భద్రత మరింత మెరుగుపరచడమే లక్ష్యంగా కేంద్ర రైల్వే శాఖ అమృత్ భారత్ స్టేషన్ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా దేశవ్యాప్తంగా పలు రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తూ.. ప్రయాణికులకు అత్యాధునిక సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుల భద్రత దృష్ట్యా శిథిలావస్థకు చేరుకున్న పాత నిర్మాణాలను తొలగించే చర్యల్లో భాగంగా నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ఉన్న పాత ఫుట్ ఓవర్ బ్రిడ్జిని కూల్చివేయాలని నిర్ణయించింది.

**మావోయిస్టుల లొంగు'బాట' కొనసాగుతోంది. ఆపరేషన్ కగార్ ధాటికి నక్సల్స్ సరెండర్ అవుతున్నారు. బలగాలు అడవుల్లోకి చొచ్చుకువస్తుండడంతో అడవులను వీడుతున్నారు. ఆయుధాలు అప్పగించి పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. కీలక నేతలు సైతం జన జీవన స్రవంతిలోకి వస్తుండడంతో మావోయిస్ట్ ఉద్యమం రోజురోజుకు బలహీనం అవుతోంది. తాజాగా తెలంగాణలో 41 మంది మావోయిస్టులు సరెండర్ అయ్యారు.**

**– అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# మావోయిస్టులకు ఎదురుదెబ్బ

**■ 41 నక్సల్స్ లొంగుబాటు ■ ఇద్దరు రాష్ట్ర నాయకులు సరెండర్ ■ వివరాలు వెల్లడించిన డీజీపీ శివధర్‌రెడ్డి**

మావోయిస్టు పార్టీ బలహీనంగా మారింది. ఆపరేషన్ కగార్‌తో బలగాలు అడవుల్లోకి చొచ్చుకు వస్తుండగా.. వారిని ఎదుర్కోలేక మావోలు ఎన్‌కౌంటర్లలో చనిపోతున్నారు. కీలక నేతలు సైతం నేలకొరుగుతున్నారు. దీంతో పలువురు మావోయిస్టులు లొంగుబాట పట్టారు. ఇందులో భాగంగా తెలంగాణ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టారు. దీంతో 41 మంది మావోయిస్టులు లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో ఇద్దరు తెలంగాణ రాష్ట్ర నాయకులతో పాటు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన మావోయిస్టులు ఉన్నారు. వీరిలో హిడ్మా బెటాలియన్ కమాండర్స్ ఉన్నట్లు డీజీపీ తెలిపారు. వారి నుంచి 24 ఆయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తెలంగాణలోని కామారెడ్డి జిల్లాకు చెందిన ఎర్రగొళ్ల రవి, మంచిర్యాల జిల్లాకు చెందిన ప్రభంజన్ లొంగిపోయిన వారిలో ఉన్నారు. ఎర్రగొళ్ల రవి 25 ఏళ్లుగా అజ్ఞాతంలో ఉన్నారు.

### ఆ ఘటన తర్వాత..

ఆంధ్రప్రదేశ్‌లోని అల్లూరి జిల్లా మారేడ్‌మిల్లి ఎన్‌కౌంటర్‌లో మావోయిస్ట్ కీలక నేత మాడ్వి హిడ్మా, ఆయన భార్య రాజే, టెక్ శంకర్ సహా పలువురు మృతి చెందారు. అంతకు ముందు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు మల్లోజుల వేణుగోపాల్, ఆశన్న తమ అనుచరులతో లొంగిపోయారు. ఈ ఘటన తర్వాత చాలా మంది నక్సల్స్ ఆయుధాలు వీడుతున్నారు. అడవిని వీడి జనంబాట పడుతున్నారు. ఆయా రాష్ట్రాల పోలీసులు సైతం ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టి లొంగుబాట్లను ప్రోత్సహిస్తున్నారు.

### గతంలో సైతం..

హిడ్మా ఎన్‌కౌంటర్ అనంతరం నవంబర్ 22న తెలంగాణలో 37 మంది మావోయిస్టులు లొంగిపోయారు. తెలంగాణకు చెందిన ఇద్దరు, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన 35 మంది సరెండర్ అయారు. అందులో ముగ్గురు రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య అలియాస్ ఆజాద్, నారాయణ అలియాస్ రమేశ్, సోమ్‌దా అలియాస్ ఎర్ర ఉన్నారు. తాజాగా మరో 35 మంది ఆయుధాలు వీడారు. దీంతో తెలంగాణలో మావోయిస్టు పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది.

### ఆపరేషన్ కగార్‌తో..

ఆపరేషన్ కగార్‌తో మావోయిస్టులు వరుసగా లొంగిపోతున్నాయి. పలు ఎన్‌కౌంటర్లలో వందలాది మంది నక్సల్స్ మృతి చెందారు. దీంతో కీలక నేతలు సైతం అడువులను వీడాలని నిర్ణయించుకున్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు.. ప్రభాకర్ రావు కస్టడీ పొడిగింపు



**అక్షరటుడే, హైదరాబాద్:** ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ప్రధాన నిందితుడు ప్రభాకర్ రావు కస్టడీ మరో వారం రోజుల పాటు పొడిగిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు ఇచ్చింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభాకర్‌రావుకు గతంలో సుప్రీంకోర్టు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించింది. అయితే ఆయన విచారణకు సహకరించడం లేదని పోలీసులు కోర్టుకు తెలిపారు. దీంతో కస్టడీకి ఈ నెల 11న ధర్మాసనం అనుమతి ఇచ్చింది. దీంతో 12న ఆయన పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. వారం రోజుల పాటు విచారించినా ప్రభాకర్‌రావు అధికారులకు సహకరించడం లేదు. ఏ విషయానికి సరైన సమాధానం చెప్పడం లేదని తెలిసింది. సుప్రీంకోర్టు ఇచ్చిన కస్టడీ గడువు గురువారంతో ముగిసింది. దీంతో పోలీసులు మరోసారి కోర్టును ఆశ్రయించారు. పోలీసుల పిటిషన్‌పై విచారణ చేపట్టిన ధర్మాసనం ప్రభాకర్‌రావు కస్టడి పొడిగింపునకు అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 25 వరకు ఆయన పోలీస్ కస్టడీలో ఉండనున్నారు.

## 'ధురంధర్' అలా తీయడం దర్శకుడి గొప్పతనం: రామ్‌గోపాల్ వర్మ



**అక్షరటుడే, సినిమాడెస్క్:** ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చి సూపర్ హిట్ టాక్‌ను సొంతం చేసుకుంది 'ధురంధర్'. ఇప్పటికే ఈ చిత్రంపై సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపించిన విషయం తెలిసిందే. తాజాగా రామ్‌గోపాల్ వర్మ ఎక్స్ వేదికగా 'ధురంధర్'పై తన రివ్యూ ఇచ్చారు. ఇది భారతీయ సినిమా భవిష్యత్తును మార్చేసిందన్నారు. చరిత్రలో ఈ సినిమా ఎప్పటికీ ప్రత్యేకంగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఇది ఏ భాషలో తెరకెక్కిందనే దాని గురించి నేను మాట్లాడడం లేదన్నారు. ఇది భారతీయ సినిమా. ఇప్పటివరకూ ఇలాంటి కథతో ఏ సినిమా రాలేదు. సినిమా మొత్తం చూసిన తర్వాత మన మనసుల్లో ఏదోతెలియని భావోద్వేగం నిండిపోతుంది. అలా తీయడం దర్శకుడి గొప్పతనం'' అని రామ్‌గోపాల్ వర్మ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.

## ఇన్‌స్టాలో హ్యాష్‌ట్యాగ్‌లపై పరిమితి



**అక్షరటుడే, బిజినెస్ డెస్క్:** ప్రముఖ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఇన్‌స్టాగ్రామ్ కీలక నిర్ణయం తీసుకుంది. హ్యాష్‌ట్యాగ్‌ల వినియోగంపై పరిమితి విధించింది. చాలా మంది రీల్స్ చేస్తూ సోషల్ మీడియాలో ఫేమస్ కావడానికి ప్రయత్నిస్తున్నారు. యూజర్లకు రీచ్ కావడానికి రీల్స్, పోస్టులు చేసేవారు హ్యాష్‌ట్యాగ్ ఇస్తారు. గతంలో 30 వరకు హ్యాష్‌ట్యాగ్‌లు ఇచ్చే అవకాశం ఉండేది. అయితే కంటెంట్‌కు సంబంధం లేకుండా ఎడాపెడా హ్యాష్‌ట్యాగ్‌లు ఇస్తుండడంతో పరిమితిని అమలులో తెచ్చింది. ఇక నుంచి ఒక్క పోస్ట్‌కు గరిష్టంగా ఐదు హ్యాష్‌ట్యాగ్‌లు పెట్టుకునే అవకాశం ఉంది.

## జగన్ డ్రామా ఫెయిలైంది: చంద్రబాబు




**అక్షరటుడే, అమరావతి:** రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాల విషయంలో జగన్‌కు ఎదురుదెబ్బలే తగులుతున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన.. రాష్ట్రానికి చెందిన కూటమి ఎంపీలతో సమావేశమై మాట్లాడారు. ''ఒక్క వైద్య కళాశాలల పీపీపీ వ్యవహారం మాత్రమే వైకాపాకు దొరికింది. ఆ విషయంలో కూడా ప్రజలు వాళ్లకి అవకాశం ఇవ్వలేదు. కోటి సంతకాల పేరుతో డ్రామా చేయాలని జగన్ చూశారు. కానీ.. అది కూడా ఫెయిలైంది' అని చంద్రబాబు అన్నారు.

## బంగ్లాదేశ్‌లో మరోసారి చెలరేగిన అల్లర్లు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బంగ్లాదేశ్‌లో మరోసారి అల్లర్లు చెలరేగాయి. విద్యార్థి నాయకుడు షరీఫ్ ఉస్మాన్ హాదీ మరణంతో బంగ్లాదేశ్ హింసాత్మకంగా మారింది. యువత ఆగ్రహం వ్యక్తం చేస్తూ బంగ్లాదేశ్‌లోని ప్రధాన మీడియా సంస్థలను నిరసనకారులు ముట్టడించారు. భవనాలకు నిప్పు పెట్టారు. జర్నలిస్టులపై దాడులు చేశారు. చిట్టగాంగ్‌లో ఆందోళనకారులు రెచ్చిపోయారు. ఈ నేపథ్యంలో బంగ్లాలో ఉన్న భారతీయులకు కేంద్ర ప్రభుత్వం అడ్వైజరీ జారీ చేసింది. అప్రమత్తంగా ఉండాలని సూచించింది.



## డైరెక్టర్ల నిబంధనలనే మార్చేసిన నటి..



**సినిమా అంటే ఓ టీమ్ వర్క్. ఆ టీమ్‌కు నాయకుడు దర్శకుడు. ప్రాజెక్ట్ లాక్ అయిన క్షణం నుంచి చివరి ఫ్రేమ్ వరకూ దర్శకుడి విజన్‌నే ఫాలో అవ్వాల్సి ఉంటుంది. ఎంత పెద్ద హీరో అయినా, హీరోయిన్ అయినా దర్శకుడు చెప్పినట్టే నడుచుకోవాల్సిందే. అయితే ఓ నటి మాత్రం దర్శకుల ఆలోచనలనే మార్చేసిందంటే ఆశ్చర్యమే. టాలీవుడ్, బాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించింది తాప్సీ. ఈ క్రమంలో ఓ ఆసక్తికర విషయాన్ని ఓ ఇంటర్వ్యూలో పంచుకుంది. తన సహజమైన ఉంగరాల జుట్టే ఒక దశలో తన కెరీర్‌కు అడ్డంకిగా మారిందని చెప్పుకొచ్చింది. వాస్తవానికి మొదట్లో తనకే ఉంగరాల జుట్టు నచ్చలేదని, కానీ కాలక్రమంలో దాని ప్రత్యేకత అర్థమై, అదే తన బలంగా మారిందని వెల్లడించింది. ఉంగరాల జుట్టును ఎలా సెట్ చేసుకోవాలి, ఎలా క్యారీ చేయాలి అనే విషయాల్లో అవగాహన పెంచుకున్న తర్వాత, దర్శకులను కూడా నెమ్మదిగా కన్విన్స్ చేయగలిగానని చెప్పింది. కొన్ని నెలల తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయిందని.. కొందరు దర్శకులు "ఉంగరాల జుట్టు ఉన్న హీరోయిన్‌నే కావాలి" అంటూ ప్రత్యేకంగా తననే సంప్రదించారని తెలిపింది.**

**- అక్షరటుడే, సినిమా డెస్క్**